విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :134 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 2 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## రాయలసీమ దశ మార్చేలా

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్

- లక్ష కోట్లతో బృహత్ ప్రణాళిక
- రాయలసీమను ఫ్రూట్ బౌల్‌గా మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- రూ.1 లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో మూడు దశల్లో ప్రాజెక్టు అమలు
- మదనపల్లెలో నిర్మల, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా పనుల ప్రారంభం
- భారత్‌లోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
- పది జిల్లాల్లో ఉద్యాన సాగు విస్తరణ.. 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి



**అమరావతి**

రాయలసీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టు పనులను లాంఛనంగా ప్రారంభించారు. సుమా రు రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 40,352 కోట్లు భరించనుండగా, ప్రైవేటు రంగం నుంచి రూ. 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా వివరాలు 2లో..



## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

## 'డొక్కా సీతమ్మ భోజన పథకం'పై

# నిత్యావసర ధరల ప్రభావం

- వేలాది విద్యార్థులకు అవస్థలు
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను నిత్యావసర ధరల పెరుగుదల ప్రభావితం చేస్తోంది
- సరకుల ధరలు అనూహ్యంగా తరచూ పెరుగుతుండటం పథకం అమలుపై భారం పడుతోంది.



**అమరావతి**

బడి పిల్లల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' నిర్వహణ ప్రస్తుతం కత్తిమీద సాములా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండటం, ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పథకం అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది. వంటనూనె, కందిపప్పు, గ్యాస్, ఉల్లిపాయలు, కూరగాయల ధరలు అనూహ్యంగా పెరుగుతుండటంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించడం నిర్వాహకులకు అసాధ్యంగా మారుతోంది. వివరాలు 2లో..

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు: దీప్కే వార్నింగ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను చేయాలని సీజేపీ డిమాండ్
- లేనిపక్షంలో నిరసనలు చేపడతామని హెచ్చరిక
- అక్టోబర్ 2 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు





## ఫారం- 6లో మార్పులకు ఎవరు ఆదేశించారు

- ఈసీపై రాహుల్ గాంధీ ప్రశ్నలు
- ఈసీపై మరోసారి రాహుల్ ప్రశ్నల వర్షం
- ఫారం- 6లో మార్పులు చేయాలని టీసీఎస్‌ను ఎవరు ఆదేశించారన్న రాహుల్
- దానిపై టీసీఎస్‌లో ఎవరు సంతకం చేశారని నిలదీసిన కాంగ్రెస్ అగ్రనేత



## కెప్టెన్ మచ్చర్‌ను చూసి భారతదేశం గర్విస్తోంది

- 174 మంది ప్రాణాలు కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు
- తీవ్రంగా గాయపడినా ప్రయాణికుల ప్రాణాల కోసం పోరాడిన పైలట్
- విమానాన్ని దారి మళ్లించి సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండింగ్
- పైలట్ ధైర్యాన్ని ప్రశంసించిన ట్రంప్

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0



- అధికారులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు
- నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం
- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్క్స్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'
- విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాల గుర్తుగా ప్రతిష్ఠాత్మక గ్రంథాలయం

## డ్వాక్రా రుణంతో

# వ్యాపారం

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకుండా గొడ్డలి పార్టీ అడ్డుకుంటోంది
- పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం
- రేపల్లెలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- డ్వాక్రా రుణంతో కిరాణా వ్యాపారం.. వాట్సాప్‌తో ఆర్డర్ల స్వీకరణ




**రేపల్లె**

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో న్యాయం కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో భాగంగా సీఎం చంద్రబాబు గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చాను. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక దానిని 24 శాతానికి తగ్గించింది. దీంతో 16,800 మంది పదవులు పోయాయి. ఇప్పుడు మళ్లీ వివరాలు 2లో..

## మరో 15 రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు రాక

- 'ఎల్ నినో' ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందంటే?
- భారత వాతావరణ శాఖ కీలక ప్రకటన
- అక్టోబరు 15 నుంచి 21 మధ్య దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు వచ్చే ఛాన్స్ ఉందని వెల్లడి
- మరో కొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు ముగియనున్నాయన్న ఐఎండీ



# డ్వాక్రా రుణంతో వ్యాపారం..

-మొదటిపేజీ తరువాయి

మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తుంటే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. గడచిన 28 నెలలుగా ప్రతినెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. 1వ తేదీన అధికారులు, ప్రజాప్రతినిధులు పేదల సేవలో ఉంటున్నారు. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతి నెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతి నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి-- మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4 శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.




**రేపల్లెలో డ్వాక్రా మహిళ జేజమ్మతో సీఎం చంద్రబాబు ముఖాముఖి**

స్వయం సహాయక సంఘాల ద్వారా లభించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో చిరు వ్యాపారాలు ప్రారంభించి, ఆధునిక సాంకేతికతను జోడించి వాటిని విస్తరించుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా, రేపల్లె పట్టణంలోని 4వ వార్డులో 'శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్' యజమాని జి. జేజమ్మతో పాటు ఇతర డ్వాక్రా మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. డ్వాక్రా గ్రూప్ బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.2 లక్షల రుణం పొంది, తన కిరాణా దుకాణాన్ని విస్తరించినట్లు జేజమ్మ ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్' నినాదం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి వాట్సాప్ ద్వారా ఆర్డర్లు సేకరించి, తన భర్త శ్రీనివాసరావు సహాయంతో నేరుగా ఇళ్లకే డెలివరీ చేస్తున్నామని తెలపడంతో చంద్రబాబు వారి పనితీరును అభినందించారు. ఇదే క్రమంలో పలువురు డ్వాక్రా మహిళలు తమ వ్యాపార ఆలోచనలను, భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. వాట్సాప్ బిజినెస్ వినియోగంపై మహిళలకు ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్న చంద్రబాబు, నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం, జేజమ్మ మామగారైన వెంకటరావుకు ముఖ్యమంత్రి స్వయంగా వృద్ధాప్య పింఛను అందజేశారు. పర్యటన ముగింపులో ఆయన డ్వాక్రా మహిళలతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

# మద్యం కుంభకోణం విచారణ కీలక మలుపు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న వైఎస్సార్‌సీపీ హయాంలోని మద్యం కుంభకోణం విచారణ కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ దొడ్డ వెంకట సత్యప్రసాద్‌తో పాటు ఎక్సైజ్ శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ వంటి కీలక అధికారులు కోర్టుకు , దర్యాప్తు సంస్థ సెట్ కి ఇచ్చిన వాంగ్మూలాలు సంచలనం రేపుతున్నాయి. ఈ దందా మొత్తం నాటి సీఎంవో కనుసన్నల్లోనే జరిగిందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే నిబంధనల ఉల్లంఘనలు, ముడుపుల వ్యవహారం నడిచిందని వారు వాంగ్మూలంలో పేర్కొనడం రాజకీయ సంచలనానికి దారితీసింది. అంతేకాకుండా, అంతిమ లబ్ధిదారు జగన్మోహన్ రెడ్డి అని సత్యప్రసాద్ ఏకంగా అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమవ్వడం కేసును మరింత ఆసక్తికరంగా మార్చింది. చట్టపరమైన దృక్కోణంలో విశ్లేషిస్తే, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 183 కింద మెజిస్ట్రేట్ ఎదుట నమోదు చేసే అధికారుల వాంగ్మూలానికి న్యాయస్థానంలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. పోలీసులకు ఇచ్చే వాంగ్మూలంతో పోలిస్తే, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు ఇచ్చే వాంగ్మూలాన్ని సాక్షులు లేదా అధికారులు తదనంతరం మార్చడానికి వీలుండదు. కాబట్టి రజత్ భార్గవ, సత్యప్రసాద్ వంటి ఉన్నతాధికారులు తాము ఒత్తిడికి గురయ్యామని , ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే ఫైళ్లపై సంతకాలు చేశామని మెజిస్ట్రేట్ వద్ద ధృవీకరిస్తే, అది చట్టప్రకారం ప్రధాన నిందితులకు, కుట్రదారులకు చుట్టుముట్టే బలమైన ప్రాథమిక సాక్ష్యంగా మారుతుంది. కేవలం అధికారుల , సహ నిందితుల వాంగ్మూలాలు మాత్రమే ఒకరిని దోషిగా తేల్చడానికి లేదా ఈ కేసులో వైఎస్ జగన్‌ను ప్రధాన నిందితుడు గా చేర్చి శిక్షపడేలా చేయడానికి సరిపోవు. భారతీయ సాక్ష్యాధారాల చట్టం ప్రకారం, అప్రూవర్ లేదా ప్రత్యక్ష సాక్షి చెప్పే మాటలకు మద్దతుగా స్వతంత్ర సాక్ష్యాలు తప్పనిసరి. కేవలం ఒక అధికారి సీఎం చెప్పారు అని వాంగ్మూలం ఇచ్చినంత మాత్రాన కోర్టు ఆమోదించదు. ఆ మాటలను నిరూపించేందుకు నాటి సీఎంవో ఫైల్స్, ఐఏఎస్ అధికారులకు పంపిన అంతర్గత మెమోలు, డిజిటల్ సాక్ష్యాలు , సీఎంవో అధికారుల




అధికారిక సమీక్షల నిమిత్తం నమోదైన మినిట్స్ ఆఫ్ మీటింగ్ వంటి రికార్డులను దర్యాప్తు సంస్థలు కోర్టు ముందుంచాల్సి ఉంటుంది.ఇక ఈ కేసులో అత్యంత సంక్లిష్టమైన అంశం ? నగదు లావాదేవీల నిరూపణ . లిక్కర్ స్కామ్‌లో వేల కోట్ల రూపాయల ముడుపులు మారాయని ఆరోపిస్తున్నప్పుడు, ఆ డబ్బు ఎక్కడి నుండి బయలుదేరింది, ఏ హవాలా, బ్యాంకింగ్ మార్గాల ద్వారా పయనించింది, చివరకు అది జగన్మోహన్ రెడ్డికి లేదా ఆయన కుటుంబ సంస్థలకు, ట్రస్టులకు ఎలా చేరింది అనే విషయాన్ని పక్కాగా నిరూపించాల్సి ఉంటుంది. ఒకవేళ కేవలం అధికారులు రూ. 3200 కోట్లు జగన్‌కు చేరాయి అని వాంగ్మూలంలో చెప్పినప్పటికీ, దానికి సంబంధించిన ఫైనాన్షియల్ ట్రయిల్, ఆస్తుల జప్తు లేదా డిజిటల్ ప్రూఫ్స్ చూపించకపోతే, కేసు విచారణ దశలో చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సిట్ , దర్యాప్తు సంస్థలు అనుసరిస్తున్న వ్యూహం ప్రకారం.. ముందస్తుగా అధికారుల నుంచి కుట్ర కోణాన్ని సేకరించి, ఆ తర్వాత ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్, మనీ లాండరింగ్ కోణాల్లో నిధులను వెలికితీసే పనిలో ఉన్నారు. అధికారులను బెదిరించి లేదా ఒత్తిడి తెచ్చి సీఎంవో బాధ్యత వహించేలా నిర్ణయాలు తీసుకున్నారని ఆధారాలు లభిస్తే, కుట్రలో భాగస్వామిగా, లబ్ధిదారుగా జగన్‌ను కేసులో ౦1గా చేర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి మాజీ అధికారుల వాంగ్మూలాలు కేసును మలుపు తిప్పిన మాట నిజమే అయినా, అది జగన్మోహన్ రెడ్డి అరెస్టు లేదా ౦1గా మార్చేందుకు కేవలం ఒక సపోర్టింగ్ పిల్లర్ మాత్రమే. ఈ వాంగ్మూలాల ఆధారంగా ప్రభుత్వం, సీఐడీ లేదా సిట్ బృందాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు పక్కాగా నగదు మార్పిడి రికార్డులు, డిజిటల్ ఆధారాలు, హవాలా లింకులను కోర్టు ముందు ఉంచుతాయో అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు మరియు జగన్ లీగల్ భాగస్వామ్యం ఆధారపడి ఉంటుంది

# రబీలో మెట్ట పంటల సాగుపై కిసాన్ గోష్టి

**తక్కువ నీటితో మెట్ట పంటలు సాగు చేసుకోవాలి : వ్యవసాయ అధికారులు**

**ఆత్మకూరు:** ఎల్‌నినో ప్రభావంతో రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేసే మెట్ట పంటలను ఎంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య సూచించారు. రబీ సీజన్‌లో పంటల ఎంపిక, సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ గోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మోహన్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో వివిధ పంటల్లో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్త అరుణ్ కుమార్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతో పాటు పంట నష్టాలను నివారించవచ్చని తెలిపారు. తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా మినుము, శనగ, జొన్న, వేరుసెనగ, కుసుమ తదితర మెట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన



సమయంలో విత్తడం, ఎరువుల వినియోగం, కలుపు నివారణ వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని తెలిపారు. వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకునేందుకు పంట అవశేషాలు, చిన్న నీటి కుంటలు, పొలాల చుట్టూ కాలువలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. అంతర పంటలు సాగు చేయడం, పంట అవశేషాలను నేలపై ఉంచడం, అవసరానికి అనుగుణంగా తక్కువ దున్నే పద్ధతులను అవలంబించడం ద్వారా పంటలకు మేలు జరుగుతుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. చీడపీడలను తొలి దశలోనే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, రసాయన మందులను విచక్షణారహితంగా వినియోగించకుండా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సరైన మోతాదులోనే వినియోగించాలని తెలిపారు. రాయితీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయిఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కే. హేమలత మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా రైతులకు రాయితీపై మినుము, కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాలుగు కిలోల విత్తనాల ప్యాకెట్ రూ.103.50కు, శనగ విత్తనాలు 35 శాతం రాయితీపై కిలో రూ.58.50కు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి మాట్లాడుతూ ఇప్పటివరకు పంటలు వేయని రైతులు తక్కువ నీటిని వినియోగించే, తక్కువ కాల వ్యవధి కలిగిన పంటలను ఎంచుకోవాలని తెలిపారు. నీటి వసతి ఉండి బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆరు సాళ్లకు ఒక లోతు సాలు ఏర్పాటు చేయాలని, లేదా ఒక సాలు విడిచి ఒక సాలు సాగు చేయడం ద్వారా పంటలను కొంతమేర కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0

నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమ దశ మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్

-మొదటిపేజీ తరువాయి

నిర్దేశించుకుంది. రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లోని 10 జిల్లాలకు చెందిన 303 మండలాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. 'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే సమగ్ర విధానంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్షిక ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సాగునీటి వనరులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల అనుసంధానం, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. మామిడి, అరటి, దానిమ్మ, టమాటాతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విభిన్న తరహా పంటల సాగును కూడా ప్రోత్సహించనున్నారు.

**దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోనే దేశంలోనే మొట్టమొదటి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక రంగంలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) తరహాలోనే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు సాగించనుంది. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించి ఈ సంస్థ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది. తద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో 'ఫ్రూట్ బౌల్'గా కూడా నిలపాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పంగా స్పష్టమవుతోంది.

## 'డొక్కా సీతమ్మ భోజన పథకం'పై నిత్యావసర ధరల ప్రభావం



-మొదటిపేజీ తరువాయి

ఈ ధరల ప్రభావం నేరుగా భోజన నాణ్యతపై పడుతుండటంతో వేలాది మంది విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్ రేట్లతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం పాత పద్ధతిలోనే వంట ఛార్జీలను చెల్లిస్తోంది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థికి రోజుకు గరిష్ఠంగా రూ.7, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.10, ఆపై తరగతుల వారికి రూ.17 చొప్పున మాత్రమే ఇస్తున్నారు. మార్కెట్‌లో ఏ వస్తువు ధర చూసినా మండిపోతుంటే, ప్రభుత్వం ఇచ్చే ఈ అరకొర నిధులతో నాణ్యమైన పౌష్టికాహారం ఎలా అందించగలమని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికప్పుడు మార్కెట్‌ని బట్టి ధరలను సవరించకపోవడమే ఈ దుస్థితికి కారణమని వాపోతున్నారు. అప్పులు తెచ్చి మరీ వంటలు: వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 వేల మందికి పైగా విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అయితే నిధుల విడుదల విషయంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం పథకం పాలిట శాపంగా మారింది. జిల్లాలో గత 3 నెలలుగా వంట ఛార్జీల బకాయిలు చెల్లించలేదు. బిల్లులు రాకపోయినా, విద్యార్థులు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో వంట కార్మికులు అప్పులు తెచ్చి మరీ వంటలు వండుతున్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోతే వడ్డీలకు తెచ్చి ఎంతకాలం భారం మోయాలని వంట కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒకేసారి ధరలను ఖరారు చేయడం కాకుండా, మార్కెట్ ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మెనూ ఛార్జీలను సవరించాలని క్షేత్రస్థాయి నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) నేతృత్వంలో తరచూ మార్కెట్ ధరలపై సమీక్ష జరిపి, వంట ఛార్జీలను పెంచాలని కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే, మధ్యాహ్న భోజన పథకం మరింత కుంటుపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## విశాఖలో మల్లారెడ్డి వర్సిటీ

**విశాఖపట్టణం :** తెలంగాణలో బలమైన ఇంజనీరింగ్, మెడికల్ , ప్రైవేట్ విశ్వవిద్యాలయ వ్యవస్థను నిర్మించిన బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి.. ఇప్పుడు తన దృష్టిని ఆంధ్రప్రదేశ్ వైపు సారిస్తున్నారు. తెలంగాణలో మల్లా రెడ్డి యూనివర్సిటీ'తో పాటు డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదాతో విద్యా రంగాన్ని ఏలిన మల్లా రెడ్డి గ్రూప్, ఆంధ్రప్రదేశ్‌లో తన విద్యా వ్యాపారాన్ని అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఏపీలోని ప్రధాన నగరాలు, ఉమ్మడి జిల్లాలను లక్ష్యంగా చేసుకుని రీజినల్ క్యాంపస్‌లు, శాటిలైట్ క్యాంపస్‌లు , ఆఫ్-క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుకు మల్లా రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యం ప్రణాళికలను వేగవంతం చేసింది. ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఏపీ ఐటీ, ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో మల్లా రెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఆఫ్-క్యాంపస్ పేరుతో భారీ ఆఫ్-క్యాంపస్ సెంటర్‌ను ఇప్పటికే ప్రారంభించారు. యూజీసీ అనుమతులతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ విభాగాల్లో అత్యాధునిక కోర్సులను ఆఫర్ చేస్తున్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వి.నరేంద్ర వర్మ




**బాపట్ల, పెన్ సత్తా, అక్టోబర్ 01:** గురువారం ఉదయం బాపట్ల నియోజకవర్గం లోని పిట్టలవానిపాలెం మండలం, పిట్టలవానిపాలెం గ్రామం లోని రెడ్లపాలెం, గౌడపాలెం, యస్. సి. కాలని తదితర చోట్ల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వివిధ ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు వేయాలని కోరగా ఆయన త్వరలో పరిశీలించి వేస్తామన్నారు. పిట్లవానిపాలెం గ్రామం లోని పశువుల ఆసుపత్రి గత కొంతకాలంగా సరిగా సిబ్బంది రానందువల్ల పనిచేయటం లేదు. గ్రామ ప్రజలందరూ ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి ఎనిమల్ హస్బండ్రీ ఏడీతో ఫోన్లో మాట్లాడారు. పిట్లవానిపాలెం వచ్చి ఈ సమస్యను త్వరగా పరిష్కరించమని తెలిపారు. పిట్లవానిపాలెం గ్రామం లోని శాఖాగ్రంథాలయం పై అంతస్తు నిర్మాణము, కావలసిన వివిధ సౌకర్యాలను త్వరలో కలుగజేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తెలియజేయాలని, ఆ ఇబ్బందులను వివిధ శాఖల వారితో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, పిట్టలవానిపాలెం మండలం పార్టీ అధ్యక్షుడు పందరబోయిన మురళి, మాజీ మండల కన్వీనర్ ఎండి. అఫ్జల్, ఎల్. వెంకటపతిరాజు, బొలగాని వెంకటనారాయణ, ఉపాధి హామి డి.శీనివాస్, బి. శ్రీనివాసరావు, డేగల శ్రీనివాస్ రెడ్డి, పులుగు చిన వీరరాఘవులు, బొలగాని భాస్కరరావు, డాక్టర్ ఎంసీహెచ్. సుబ్బారెడ్డి, దోమ రామచంద్రారెడ్డి, దండు రామ్మోహన్ రెడ్డి, తుమ్మ రామిరెడ్డి, పి.శివమ్మ, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది, మహిళలు, వివిధ శాఖల అధికారులు, మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధి పై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక సమీక్ష.



ప్రతి పథకం.. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి చేరాలి.

**కోటబొమ్మాళి, పెన్ సత్తా, అక్టోబర్ 01:** జిల్లా సమగ్రాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వాటి పురోగతి పై ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు, ఇళ్ల మంజూరు పై కార్యాచరణ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయనున్న పింఛన్లు, నివాస గృహాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా చేరేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. అర్హుల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పై విస్తృత అవగాహన కల్పిస్తూ, వాటి ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యకరంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పంచకర్ల.





అర్హులందరికీ పెన్షన్లు ...ఇంటి పట్టాలు...

**పెందుర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 01:** నియోజకవర్గం జీవీఎంసీ 93 వార్డు (కొత్త వార్డ్ 119) లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్, ఇంటి పట్టా అందజేయడానికి కృషి చేస్తున్నట్లు పంచకర్ల రమేష్ బాబు తెలియజేశారు. నాయుడు తోట సాయి దుర్గా నగర్ లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకొని పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే రమేష్ బాబు స్వయంగా చీపురు పెట్టి ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరు శుభ్రతకు పెద్దపేట వేయాలని సూచించారు. జీవీఎంసి అధికారులు అందించే తడి పొడి చెత్త బుట్టలను సద్వినియోగపరచుకుని వేరువేరుగా చెత్తను పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తారీఖున పెన్షన్ మొత్తాన్ని గత రెండున్నర ఏళ్ల కాలంలో క్రమ పద్ధతిలో లబ్ధిదారులకు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి కార్యక్రమం ఉన్న పెన్షన్ పంపిణీ మాత్రం ఆగలేదని స్పష్టం చేశారు. వృద్ధులు వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిబద్ధతతో పనిచేస్తున్నారని వివరించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఒక్కరోజు పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు అని ఎమ్మెల్యే రమేష్ బాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోనల్ కమిషనర్ శంకర్రావు, పెందుర్తి మండల రెవెన్యూ అధికారి ఇంటి వెంకట అప్పారావు, జీవీఎంసీ ఏపీడీవో గంగాధర్, బిజెపి నియోజకవర్గం ఇంచార్జ్ గొర్లి రాము నాయుడు, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయిత సింహాచలం, మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ కన్నా, స్థానిక వార్డు అధ్యక్షులు గంగు వరహాలు, సీనియర్ నాయకులు ఎర్ర నాగరాజు, జుత్తాడ శ్రీనివాసరావు, పెందుర్తి ఏఎంసీ డైరెక్టర్ హైమావతి, ఆర్ఎస్ నాయుడు, వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, సిహెచ్ సి మెంబర్ వరూధిని, తదితర పెందుర్తి మండలం జీవీఎంసీ 93 వ వార్డు ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్.



లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను స్వయంగా పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.



**చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 01:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వయంగా పాల్గొని పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. గురువారం ఉదయం చోడవరం నియోజకవర్గం, రోలుగుంట మండలంలో కంచు గుమ్మల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పంపిణీ చేశారు. మానసిక వికలాంగు లైన గడమల సుకుమార్ నకు రూ.15,000 లను కలెక్టర్ స్వయంగా నగదు పంపిణీ చేశారు. అదేవిధంగా మరో శారీరక దివ్యంగురాలైన సండక సింహాచలం నకు రూ.6,000 లను, మరో లబ్ధిదారుడైన ఈ. అప్పారావు నకు రూ.4,000 లను వృద్ధాప్య పింఛన్ కింద జిల్లా కలెక్టర్ నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నెలనెలా పెన్షన్లను పంపిణీ చేస్తున్నారా, ఎవరైనా డబ్బులు ఆడిగారా అంటూ ఆరా తీశారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన...కొణతాల, పీలా




**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 01:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి మండలం, అక్కిరెడ్డిపాలెం గ్రామంలో ఆరోగ్యశాఖ డిఎండ డిహెచ్ఓ ఆధ్వర్యంలో వృద్ధుల సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ హాజరై వయోవృద్ధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను కొణతాల వివరించారు. అనంతరం వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. వయోవృద్ధుల ఆరోగ్య పరి రక్షణకు అవసర మైన సేవలను నిరంతరం అందుబాటులో ఉంచాలని అధికారులను సూచించారు. వయవృద్ధులు ఉదయం నడవడం కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి, అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ చైర్మన్లుకు హోంమంత్రి అనిత సన్మానం.

- పాఠశాలల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- బాధ్యతాయుతంగా పనిచేయాలి.



**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 01:** పాయకరావుపేట నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పాఠశాలల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్లుకు హోంమంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు. నక్కపల్లి లోని తన నివాసం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ఎస్ఎంసి ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. పదవితో పాటు బాధ్యత కూడా పెరిగిందని, పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసర మైన మౌలిక వసతులు, పరిశుభ్రత, ఇతర సౌకర్యాలను ఎప్పటి కప్పుడు పరిశీలించాలని ఎస్ఎంసీ చైర్మన్లకు హోంమంత్రి సూచించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యతను కూడా తరచూ పరిశీలించాలని చెప్పారు. పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తమ పిల్లలుగా భావించి పనిచేయాలని అనిత సూచించారు. పిల్లలు దేవుడితో సమానమని, వారికి సేవ చేయడం దేవుడికి సేవ చేయడంతో సమానమని పేర్కొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ల హయాంలో ఆయా పాఠశాలలు మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. పాయకరావుపేట నియోజకవర్గం లోని ఆర్ఓ ప్లాంట్లు లేని పాఠశాలలను గుర్తించి, అవసర మైన చోట్ల ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేస్తానని హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా ఎస్ఎంసీ చైర్మన్లు ఇళ్ల బాధ్యతలతో పాటు పాఠశాలల అభివృద్ధి పైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అనిత సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు హోంమంత్రి అనిత శుభాకాంక్షలు తెలియజేసి, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

## రోలుగుంట మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన.

**పేదలు సేవలు 2.0 కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్.**



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 10:** పేదల సేవలు 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం కంచు గుమ్మల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని వారి సలహాలు, సూచనల మేరకు అధిక పంట దిగుబడి చేసుకునేలా రైతుల కృషి చేయాలి అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. మండలంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించారు. పాఠశాల విద్యార్థినిలను కలసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు చదువుతున్న వివరాలు, వారి చదువులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి పూర్తయిన తర్వాత భవిష్యత్తు కోర్సుల గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు వహించాల్సిన జాగ్రత్తలు, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వారితో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. తిమ్మరాజు చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్: అనంతరం, రోలుగుంట మండలం కంచు గుమ్మల గ్రామం లోని తిమ్మరాజు చెరువును అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. చెరువులో నీటి నిల్వలు, పంట పొలాలకు ఏ విధంగా నీరు అందుతుందో అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సేంద్రియ ఎరువుల తయారీ విధానం పరిశీలించారు. మండలంలో కేంద్రీయ ఎరువులు తయారు చేస్తున్న విధానాన్ని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ ఎరువులు ఉపయోగించడం ద్వారా నేల నిర్మాణాన్ని మెరుగు పరుస్తాయి. దీనివల్ల వేర్లకు గాలి బాగా అందుతుందని, నేల నీటిని ఎక్కువ సేపు నిలుపుకునే శక్తిని పొందుతుందని, మొక్కలకు కావలసిన పోషకాలను ఇవి నెమ్మదిగా, నిరంతరం అందిస్తాయని, భూమిలో మేలు చేసే బాక్టీరియా, వానపాములు వంటి జీవులు పెరుగి, రసాయనిక ఎరువుల లాగా భూగర్భ జలాలు కలుషితం కావని రైతులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. మంచినీటి ట్యాంక్, అంగన్వాడీ భవనం, ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనము తనిఖీ:రోలుగుంట మండలం, దిబ్బలాపాలెం గ్రామం లో నిర్మాణంలో ఉన్న మంచినీటి ట్యాంక్, అంగన్వాడీ భవనం, ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనము తనిఖీ చేసి నిర్మాణ పనులు గురించి సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు.

ఈ పర్యటన కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సిహెచ్. నాగమ్మ, ఎంపీడీవో వీఎస్. నాగేశ్వర రావు, మండల స్పెషల్ అధికారి సత్యనారాయణ, పీడీ ఐసిడిఎస్ సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా సమాజ సేవకు తరలి రండి.

- పర్యావరణ పరిరక్షణలో మీరు భాగస్వామ్యులు కండి.
- తీర ప్రాంత రక్షణ వనాలు పెంచుదాం సహకరించండి.
- సమాజ సేవ ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించండి.
- జెవి రత్నం వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 01:** గాంధీ జయంతి సందర్భంగా సమాజ సేవకు తరలి రండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఆళ్వార్ దాస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన ఎన్సిసి క్యాడేట్లకు గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో రత్నం పర్యావరణ పరి రక్షణ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి వేడెక్కిపోతున్న తరుణంలో, శీతోష్ణస్థితి మార్పు, ఎల్ నినో సూపర్ ఎల్ నినో లో నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరి రక్షణ కోసం కృషి చేయవలసిన అవసరం ఏర్పడిందన్నారు. అలాగే శీతోష్ణస్థితి వేడెక్కుతున్న తరుణంలో మంచు కొండలు కరగడం, సముద్ర నీటిమట్టం పెరగడం, తీరప్రాంతాల కోతకు గురవడం అధికంగా జరుగుతుందని పేర్కొన్నారు. దీనిని అధిగమించడానికి తీర ప్రాంత రక్షణ వనాలు పెంచుదాం సహకరించండి అని కోరారు. తీర ప్రాంత రక్షణ కోసం మొగలి వనాలు, తాటి తోపులు, సరుగుడు తోటలు పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అలాగే తీరం లొ ఇసుక తిన్నెలను కాపాడేందుకు సీ గ్రాస్, మోర్నింగ్ గ్లోరీ, పల్లేరు మొక్కలను పెంచుదాం అన్నారు. తీరంలో పెరుగుతున్న అన్ని మొక్కలను పరిశీలించి మిగిలిన ప్రాంతాలకు వ్యాప్తి చేద్దాం అని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ సమాజ సేవ ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. రేపటి పౌరులుగా నేటి యువత ఉన్నత స్థాయిలో సమాజసేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ రాజా ఉమెన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ ఊర్మిళ, యాక్షన్ ఎయిట్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## న్యాయవాదులపై దాడులు దారుణం

**బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ**




**ధర్మవరం,అక్టోబర్ 01 (పెన్ సత్తా)**విజయవాడలో న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ ధర్మవరం కోర్టు న్యాయవాదులు నిరసన చేపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,చట్టం ద్వారా ప్రజలకు రక్షణ కల్పించే న్యాయవాదులపైనే దాడులు జరగడం దారుణమన్నారు. న్యాయవాదులపై దాడులు జరిగితే చట్టానికి భద్రత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## కొండపావులూరులో పేదల సేవలో--2.0 కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ.




- అవ్వ తాతలకు నేరుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేసిన యార్లగడ్డ.
- గ్రామసభ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే.
- రూ.36 లక్షలతో నిర్మించనున్న వెల్‌నెస్ సెంటర్‌కు భూమిపూజ.
- రూ.55 లక్షలతో కొండపావులూరు--కట్టుబడిపాలెం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన.
- శాస్కి నిధులతో రూ.1.39 కోట్లతో సూరంపల్లి -- రామచంద్రాపురం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన.

**గన్నవరం, పెన్ సత్తా, అక్టోబర్ 01:** నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం మండలం కొండపావులూరు గ్రామంలో గురువారం 'పేదల సేవలో--2.0' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు నేరుగా పింఛన్లు అందజేశారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండపావులూరులో రూ.36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న వెల్‌నెస్ సెంటర్‌కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలాన్ని దాత మేడవరపు రామశేషు అందించారు. ఈ సందర్భంగా రామశేషు దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. పల్లె పండుగ--3.0 కార్యక్రమంలో భాగంగా రూ.55 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కొండపావులూరు--కట్టుబడిపాలెం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, శాస్కి నిధులతో రూ.1.39 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సూరంపల్లి--రామచంద్రాపురం రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొండపావులూరు నుంచి కట్టుబడిపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిధుల కొరత కారణంగా రహదారి అభివృద్ధిలో జాప్యం జరిగిందని, ప్రస్తుతం రూ.55 లక్షలతో పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రహదారిలో ఒక భాగానికి ప్రస్తుతం పనులు చేపడుతున్నామని, మిగిలిన భాగానికి కూడా ప్రభుత్వ నిధులు తీసుకొచ్చి త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. చాలాకాలంగా రహదారి సౌకర్యం లేని గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, బిల్లనపల్లి రహదారికి రూ.1.30 కోట్లు, రామచంద్రాపురం -- సూరంపల్లి రహదారికి రూ.1.39 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రామచంద్రాపురం గ్రామం లోని అంతర్గత రహదారుల పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. వాటి అభివృద్ధికి నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. గత కొంతకాలంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలను ప్రత్యేకంగా పరిగణన లోకి తీసుకుంటామని, చిన్న గ్రామాలన్నింటికీ అవసరాన్ని బట్టి నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఓట్ల సంఖ్యను ప్రాతిపదికగా చేసుకోకుండా గ్రామాల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో చాలా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. కనీసం గుంతలను కూడా పూడ్చకుండా వదిలేశారని పేర్కొన్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు పోలవరం - ఏలూరు కాలువ అనుసంధానానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. ఏలూరు కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలిగేలా ఎనికేపాడు యూటి ద్వారా నీటి లభ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆత్కూరు వద్ద హై లెవెల్ వంతెన నిర్మాణానికి రూ.20.50 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో పారిశ్రామిక, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హెచ్‌సీఎల్ సంస్థ సహకారంతో ఇంజినీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు పై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. గన్నవరం పట్టణం లోని ప్రధాన రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నామని యార్లగడ్డ తెలిపారు. ప్రజలు, వ్యాపారుల సహకారంతో రహదారుల విస్తరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మాజీ శాసనసభ్యుడి నివాసం ఉన్న రహదారిని కూడా తానే విస్తరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రహదారులను విస్తరించి మధ్యలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా జలాలను అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో చెత్త సమస్య పరిష్కారానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి వ్యర్థాలను తరలించే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. రామచంద్రాపురం రహదారి పనులకు ఇన్ని రోజులు జాప్యం జరిగినందుకు గ్రామస్థులు మన్నించాలని కోరారు. కూటమి పార్టీ నాయకులు , కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అతిపెద్ద ఉద్యానవన క్షేత్రంగా రాయలసీమ మంత్రి సవిత.

- అక్టోబర్ 2న రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటు.
- సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ పవన్ చేతుల మీదుగా శ్రీకారం.
- మారనున్న రాయలసీమ రూపు రేఖలు.
- రూ.26 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి.
- రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన.
- కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు మంత్రి సవిత.




**పెనుకొండ, పెన్ సత్తా, అక్టోబర్ 01:** రూ.లక్ష కోట్లతో ప్రారంభించనున్న హార్టీకల్చర్ హబ్ తో దేశం లోనే రాయలసీమ అతిపెద్ద ఉద్యానవన క్షేత్రంగా మారబోతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వెలిబుచ్చారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శుక్రవారం శ్రీకారం చుడుతున్నామన్నారు. సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్ ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. గ్లోబర్ హార్టీకల్చర్ హబ్ తో రాయలసీమ రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లా, పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఒకప్పుడు రాళ్లసీమ మారిన రాయలసీమ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సస్యశ్యామలంగా మారుతోందన్నారు. ఇప్పటికే రాయసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ఇపుడు రూ.లక్ష కోట్లతో రాయలసీమలో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటుకు నిర్ణయించారన్నారు. ఈ ప్రాజెక్టుతో రాయలసీమలో వాణిజ్య పంటలు సాగుకు పెద్ద ఎత్తున అవకాశం కలుగుతుందన్నారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో రాయలసీమ దేశంలో అతిపెద్ద వ్యవసాయ క్షేత్రంగా ఆవిర్భవించనుందని మంత్రి సవిత తెలిపారు. రూ.26 వేల కోట్ల సాగునీటి ప్రాజెక్టుల పూర్తి. హార్టీకల్చర్ హబ్ ప్రాజెక్టులో భాగంగా 13 జిల్లాల పరిధి లోని 201 క్లస్టర్లలో వినూత్న పంటల సాగును ప్రోత్సహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 14.41 లక్షల హెక్టార్లకు ఉద్యానవన సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి పెంచేలా మైక్రో ఇరిగేషన్ కు మరింత పెద్ద పీట వేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సాగునీటి రంగానికి రూ. 26 వేల కోట్లను వెచ్చిస్తున్నామని, ఈ నిధులతో రాయలసీమ లోని 52 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయనున్నామని తెలిపారు. పంట నిల్వ చేయడానికి కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటి ద్వారా పంట వృథాను అరికట్టడమే కాకుండా, రైతులకు ఆర్థిక మేలు కలుగుతుందన్నారు. రాయలసీమకు సాగు, తాగునీరిచ్చిన ఘనత చంద్రబాబుదే..అయిదేళ్ల జగన్ పాలనలో రాయలసీమకు, ఈ ప్రాంత రైతంగానికి చేసిందేమీ లేదని మంత్రి సవిత విమర్శించారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత అన్న ఎన్టీఆర్ ది, సీఎం చంద్రబాబు దేనన్నారు. మడకశిరకు, కుప్పానికి, పులివెందులకు కృష్ణా జలాలు అందించన ఘనత సీఎం చంద్రబాబు నాయుడిదేనన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమలోని ప్రతి ఎకరాకూ నీరందిస్తామని మంత్రి సవిత తెలిపారు. నేడు(అక్టోబర్ 2న) హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం. రాయలసీమలో ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పెద్ద ఎత్తున పరిశ్రమలను కూటమి ప్రభుత్వం ఏర్పటు చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. అక్టోబర్ రెండో తేదీన గాంధీ మహాత్ముని జయంతి సందర్భంగా మదనపల్లెలో సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుడుతున్నామన్నారు. రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటుతో రాయలసీమ రూపు రేఖలే మారిపోతాయన్నారు. రాళ్ల సీమను రతనాల సీమగా మారుస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు కు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

## వెయిట్ లిఫ్టింగ్ డిస్ట్రిక్ట్ లీగ్ టోర్నమెంట్ ను ప్రారంభించిన కొణతాల








**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 01:** కేంద్ర ప్రభుత్వం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహణలో అనకాపల్లి, వేల్పుల వీధి కళ్యాణ మండపం నందు నేషనల్ వెయిట్ లిఫ్టర్ గుమ్మాల రాము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల విభాగ అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ డిస్ట్రిక్ట్ లీగ్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటగా వెయిట్ లిఫ్టింగ్ డిస్ట్రిక్ట్ లీగ్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఆడపిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధిస్తారన్న కొణతాల. అనకాపల్లి 14 ఏళ్ల లోపు బాలికలకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలకు తల్లిదండ్రులు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం కూడా పెంపొందుతుందని పేర్కొన్నారు. ఇటీవల క్రీడా పోటీల్లో మహిళలు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. కబడ్డీ, క్రికెట్, ఆర్చరీ వంటి క్రీడల్లో బాలికలకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో రాణిస్తున్న క్రీడాకారులను అభినందించారు. అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత, ప్రెసిడెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైట్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, ఇండియా వైట్ లిఫ్టింగ్ ఫ్రోడరేషన్, నెంబర్ ఆఫ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నీలంశెట్టి లక్ష్మి, సీనియర్ వెయిట్ లెఫ్టర్స్, పాల్గొన్నారు.

# రప్పా రప్పా నరికే కల్చర్ వైసీపీది మంత్రి సవిత.





- వైసీపీ కుట్ర రాజకీయాల పై మంత్రి సవిత ఫైర్.
- రెచ్చగొట్టే రాజకీయాలు టీడీపీ నైజం కాదు.
- అభివృద్ధి--సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.
- పెనుకొండ మున్సిపాలిటీ లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి సవిత..

**పెనుకొండ, పెన్ సత్తా, అక్టోబర్ 01**: రప్పా రప్పా నరుక్కునే కల్చర్, కుట్రలు, రెచ్చగొట్టే రాజకీయాలు చేసేది వైసిపి అని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత విమర్శించారు. తెలుగుదేశం పార్టీ రెచ్చగొట్టే రాజకీయాలను ప్రోత్సహించే పార్టీ కాదని, ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. పెనుకొండ మున్సిపాలిటీ లోని 21 వ వార్డులో మంత్రి సవిత ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సవిత భూమిపూజ చేశారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు మున్సిపాలిటీలో మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు నియోజకవర్గంలో అవసర మైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. గోరంట్లలో జరిగిన ఘటన పై మంత్రి స్పందిస్తూ, వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు రాజకీయ కుట్రలో భాగమని ఆరోపించారు. వాటాల విషయంలో తలెత్తిన వివాదాలకు రాజకీయ రంగు పులిమి టీడీపీ పై నిందలు వేయడం సరికాదన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం మానుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం పై దృష్టి సారించిందని, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, మౌలిక వసతులతో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు టీడీపీ నైజం కాదు. అభివృద్ధి, సంక్షేమమే మా ధ్యేయం. ప్రజల సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం.





**పేదల సేవలో 2.0' ద్వారా సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 01:** ప్రజల కోసం, ప్రజలతో, ప్రజల చేతే అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'పేదల సేవలో 2.0 కార్యక్రమంలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు, వాటి అర్హతలు, లబ్ధి వివరాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని ప్రజలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అర్హత కలిగిన లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న పెన్షన్లు, మహిళా సంక్షేమం, రవాణా సంబంధిత సేవలు, డ్వాక్రా సంఘాలు తదితర పథకాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అర్హత ఉన్నప్పటికీ ఏదైనా పథకం ద్వారా లబ్ధి పొందని వారు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల పై పూర్తి సమాచారం అందించడం, అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు చేరేలా చూడడమే 'పేదల సేవలో 2.0' కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి దిలీప్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, కూటమి నాయకులు అత్తిలి శంకర రావు, దాము, నవీన్ తదితరులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేడు మాంసం, చేపల దుకాణాలకు సెలవు.

- ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టపర మైన చర్యలు.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 01:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధి లోని మేక మాంసం, కోడి మాంసం, చేపల విక్రయ దుకాణాలకు నేడు అక్టోబర్ 2 వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ పరిధి లోని అన్ని మాంసం, కోడి మాంసం, చేపల విక్రయ దుకాణాలు అక్టోబర్ 2 న తప్పనిసరిగా మూసివేయాలని, అలాగే ఆరోజు జంతు వధశాలలకు సెలవు ప్రకటించడ మైనదని కమిషనర్ తెలిపారు. ఆ రోజున ఎటువంటి మాంసం, చేపల క్రయవిక్రయాలు నిర్వహించరాదని, జీవీఎంసీ ఆదేశాలను ఉల్లంఘించి దుకాణాలు తెరిచి క్రయవిక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత దుకాణదారుల పై చట్టపర మైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు.

## జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా ఈ. సందీప్ బాధ్యతల స్వీకరణ.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 01:** అనకాపల్లి జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పిపి) డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఈ. సందీప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ విషయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డిప్యూటీ సీఈఓ ఈ. సందీప్ కార్యాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రతి ఉద్యోగి సమన్వయంతో, బాధ్యతాయుతంగా, సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సక్రమంగా చేరేలా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. సిబ్బంది సంక్షేమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో (ఏపిపిఆర్ఈఎంఎ) రాష్ట్ర అడ్హాక్ కమిటీ అధ్యక్షులు ఎస్. సత్తిబాబు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టిబాబు, పరిపాలనాధికారి పి.వి.వి.ఎన్. మూర్తి, ఏఓ అమ్మాజి తదితరులు పాల్గొని నూతన డిప్యూటీ సీఈఓ ఈ. సందీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పెన్షన్లకు, ఇళ్ల పట్టాలకు నాంది పలికింది టీడీపీ గంటా



**కొమ్మాది, పెన్ సత్తా, అక్టోబర్ 01:** పెన్షన్లు, పేదలకు ఇళ్లు వంటి సంక్షేమ పథకాలకు టీడీపీ నాంది పలికిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కొమ్మాది ప్రశాంత్ నగర్ లో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశారు. అనంతరం ఆశీర్వాద్ ఫంక్షన్ హాల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకుని ఏ క్షణంలో ఎవరు వచ్చి దాన్ని తొలగిస్తారోనని భయంతో బతుకుతున్న వారికి పూర్తి యాజమాన్య హక్కులతో ఇళ్ల పట్టాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19 న ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో వివిధ కారణాలతో సీఎం చేతుల మీదుగా పట్టాలు తీసుకోలేని భీమిలి నియోజకవర్గం లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్నానని వివరించారు. 2014-19 లో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ, గాజువాక సభల్లో 60 వేల మందికి పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. విశాఖలో రూ. 8,875 కోట్ల విలువైన స్థలాలను 28,445 మందికి, విజయవాడలో రూ. 11,246 కోట్ల స్థలాలు 26,401 మందికి ఇళ్ల పట్టాల రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. అర్బన్ లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం రూ. 3,892 కోట్లు కేటాయించామని, గ్రామీణ ప్రాంతాల్లో 161 పల్లె పండుగ పనులకు రూ. 37 కోట్లు, 11 రోడ్ల నిర్మాణానికి రూ. 11.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. జీవీఎంసీ వార్డులకు రూ.125 కోట్లు:

భీమిలి, మధురవాడ జోన్ల లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ. 125 కోట్లు కేటాయించినట్టు గంటా చెప్పారు. ఎలాంటి షరతులు లేకుండా నిధులు వాడుకునే వెసులుబాటు కల్పించారని, వార్డుల వారీ ప్రాధాన్యాలను అనుసరించి ఖర్చు చేస్తామన్నారు. 65 పార్కుల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ వంటి సౌకర్యాల కల్పనకు వినియోగిస్తామని వెల్లడించారు. అసంపూర్తిగా వదిలేసిన రెండు కళ్యాణ మండపాలు ఈ నిధులతోనే పూర్తి చేశామని తెలిపారు. పేదల సేవలో 2.Iా" కార్యక్రమంలో భాగంగా వారికి అందుతున్న సంక్షేమ పథకాలు సచివాలయాల్లో నమోదు చేసి, ప్రభుత్వం నుంచి ఇంకా ఏం కోరుకుంటున్నారనేది తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. పేదల సామాజిక ఆర్థిక అభివృద్ధికి ఉద్దేశించిన పీ4 లో భాగస్వామ్యులు కావడానికి దాతలు ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో పీ4 విజయవంతంగా ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ



సంగీత్ మాధుర్, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఎమ్మార్వోలు పాల్ కిరణ్, శ్రీనుబాబు, శైలజ, ఏపీడీ శ్రీరాం, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మన్యాల సోంబాబు, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్, నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, శాఖారి శ్రీనివాస్, కానూరు అచ్యుతరావు, పిల్లా వెంకట్రావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, నాగోతి సూర్య ప్రకాష్, బోయి శ్రీను, మంగాదేవి, లొడగల అప్పారావు, నాగోతి వెంకట్రావు, పోతిన శివ, సత్య వరప్రసాద్, తమ్మిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో దొడ్డి





**మునగపాక, పెన్ సత్తా, అక్టోబర్ 01:** మండలం, నాగులాపల్లి గ్రామంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాలతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మునగపాక మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు పాల్గొని పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరవాత చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. చంద్రబాబు అంటే సంక్షేమం, సంక్షేమం అంటే చంద్రబాబు అని పేద ప్రజలు కళ్ళల్లో ఆనందం చూడడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది అనడానికి నిదర్శనం మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ భవనాలు, సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, అనేక మైన సంక్షేమ కార్యక్రమాలు మొదలైనవి అన్నారు. గత ప్రభుత్వంలో గుంతల రోడ్ల వలన ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రజలకు గుర్తుఉంది అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లన్నీ పూర్తి చేయడం ద్వారా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ప్రజలను అడిగితే చెపుతారు అన్నారు. కార్మికులు, రైతులు, అందరూ ప్రభుత్వ పనితీరు పై చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అరాచకాల మధ్య రాష్ట్రం దివాలా అయ్యింది అన్న సంగతి ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడు కి తెలుసన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు అధిక వస్తున్నాయి అనడానికి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం, గ్రామాల్లో మౌలిక వసతులు పూర్తవడం, రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతి చెందుతుంది అంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కృషి ఎంతగానో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని దొడ్డి శ్రీనివాస రావు అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అవ్వని అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వెళ్లే రోడ్ ను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శరవేగం గా అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ పి రాజు నాయుడు, పి నాగు, గోశాల గోవింద్, మూర రామేశ్వర రావు, కొరిబిల్లి రాము, పెంటకోట శివ, ఓరుగంటి భాస్కర రావు, కొణతాల రమేష్, యస్ శ్రీను, పిచ్చికి ఈశ్వర రావు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం





**మునగపాక, పెన్ సత్తా, అక్టోబర్ 01:** తోటాడ, గంగదేవిపేట, తిమ్మరాజుపేట గ్రామాల్లో అంగన్వాడి ఉత్సవాలు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవ సందర్భంగా "సేవా సంకల్ప అభియాన్ "లో భాగంగా రాష్ట్రంలో అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ ఉత్సవం నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా గురువారం మునగపాక మండలం లోని తోటాడ, గంగదేవిపేట, తిమ్మరాజుపేట గ్రామాల్లో అంగన్వాడి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షులు మళ్ళ కాశీశ్వర రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వ తేదీ వరకు ప్రతి అంగన్వాడి కేంద్రం లోని మూడు రోజులు నిర్వహిస్తారు అని, ఈ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, పిల్లలకు అందిస్తున్నటువంటి పోషకాహారం, వారి యొక్క సంరక్షణ టీకాలు, సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమములను లబ్ధిదారులు మాటలలో సమాజం ముందు తీసుకురావడం జరిగింది. సంక్షేమ శాఖ ద్వారా అందించే ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గురించి చెప్పడం జరిగింది. అనంతరం తోటాడ అంగన్వాడి -2 ఏడబ్ల్యూడబ్ల్యూ జి .ఉమాదేవి ని, ఏడబ్ల్యూహెచ్ ఆర్. వెంకటలక్ష్మి ని, గంగదేవిపేట ఏడబ్ల్యూడబ్ల్యూ సిహెచ్. వరలక్ష్మి ని, ఆశ వర్కర్ వరలక్ష్మి ని, తిమ్మరాజుపేట ఏడబ్ల్యూడబ్ల్యూ కె .సత్య ని సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పి .నాగభూషణం, హార్టికల్చర్ జిల్లా కన్వీనర్ సూరిశెట్టి రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ముల్లేటి విశ్వనాథం పాల్గొన్నారు.

# స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ జూకురు సుమలతకు ఘన సన్మానం

- మానవ హక్కుల పరిరక్షణలో సేవలకు గుర్తింపుగా స్వర్ణ నంది అవార్డు
- అవార్డును సంస్థ సభ్యుల సేవలకు అంకితం చేస్తున్నా: డాక్టర్ సుమలత
- మానవ హక్కుల పరిరక్షణకు మరింత బాధ్యతతో పనిచేస్తాం:సుమలత
- డాక్టర్ సుమలతకు అభినందనలు తెలిపిన..సంస్థ సభ్యులు,సేవా ప్రతినిధులు




**ధర్మవరం,అక్టోబర్ 01 (పెన్ సత్తా)**మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా రంగాల్లో సేవలందిస్తున్న డాక్టర్ జూకురు సుమలత, అడ్వకేట్ స్వర్ణ నంది అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మేఘా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో,సినీ ప్రముఖుల సమక్షంలో,శిరీష రెడ్డి సహకారంతో ఆమె స్వర్ణ నంది అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ అవార్డును సంస్థ సభ్యులందరి సేవలకు అంకితం చేస్తున్నట్లు డాక్టర్ సుమలత తెలిపారు. ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి,మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దామోదర్, ఫర్హానా,చంద్రమౌళి, రవి,లక్ష్మి,శ్రీదేవి, రిజ్వానా తదితరులు, సేవా ప్రతినిధులు, అభిమానులు పాల్గొని డాక్టర్ సుమలతకు అభినందనలు తెలిపారు.

# మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ భూమి పూజకు ఏర్పాట్లు ముమ్మరం

**మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు,ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి పరిశీలన**

**ధర్మవరం,అక్టోబర్ 01 (పెన్ సత్తా )**ధర్మవరం చేనేత రంగ అభివృద్ధికి కీలకమైన మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ భూమి పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. అక్టోబర్ 5వ తేదీ సోమవారం ధర్మవరం మార్కెట్ యార్డులో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు ఆరోగ్య శాఖ మంత్రి,ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్,రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్,రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి సవిత హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు గురువారం ధర్మవరం మార్కెట్ యార్డును పరిశీలించారు. ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మార్వో దేవరాజ్, మున్సిపల్ ఈఈ సాయి కృష్ణ,టూ టౌన్ సీఐ జయ నాయక్,హ్యాండ్లూమ్ ఏడీ అప్పాజీ,బీజేపీ నాయకులతో కలిసి భూమి పూజకు అనువైన స్థలాన్ని పరిశీలించారు.

కార్యక్రమ వేదిక, ప్రముఖుల రాకపోకలు,పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అలాగే పోతుకుంట వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి భద్రత,



వాహనాల రాకపోకలు,ఇతర మౌలిక వసతులపై సమీక్షించారు.

కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హరీష్ బాబు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మార్వో దేవరాజ్, మున్సిపల్ ఈఈ సాయి కృష్ణ,టూ టౌన్ సీఐ జయ నాయక్,హ్యాండ్లూమ్ ఏడీ అప్పాజీ,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, పట్టణ అధ్యక్షుడు చంద్ర,ప్రకాష్ గౌడ్,శ్యామ్ రావు,సోమ్లా నాయక్, ముత్యాల గౌడ్, కృష్ణాపురం జమీర్, కుంచుపు రవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ బెల్ట్ పరిధిని స్పష్టంగా వెల్లడించాలి.



**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 01**: గ్రామంలో పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఏపీఐఐసీ అధికారులను అడ్డుకున్న రైతులు. మేజర్ పంచాయతీ పరవాడ గ్రామంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో గ్రీన్ బెల్ట్ పరిధిలో పనులు ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. గ్రీన్ బెల్ట్ పరిధి ఎంత వరకు ఉందో స్పష్టత లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ అధికారులు గతం లోనే గ్రీన్ బెల్ట్‌కు సంబంధించి తమకు వివరాలు చెప్పామని పేర్కొన్నారు. దీని పై రైతులు స్పందిస్తూ గతంలో చెప్పామని నోటి మాటగా చెబితే సరిపోదని, గ్రీన్ బెల్ట్ పరిధి ఎక్కడి వరకు ఉందో అధికారికంగా చూపించాలి అని కోరారు. దానికి సంబంధించిన ఆథరైజ్డ్ కాపీని మాకు ఇవ్వాలి అని స్పష్టం చేశారు. ఈ విషయం పై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాస రావు, మాజీ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, రైతులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడారు. గ్రీన్ బెల్ట్ హద్దులు, పరిధికి సంబంధించిన అధికారిక పత్రాలను రైతులకు అందించిన తర్వాతే పనులు చేపట్టాలని వారు కోరారు. గ్రీన్ బెల్ట్ ఎంత మేరకు ఉందో స్పష్టంగా తెలియజేసే అధికారిక మ్యాప్ లేదా ఆథరైజ్డ్ పత్రం కాపీని రైతులకు అందించాలని వారు కోరారు. కేవలం మౌఖికంగా వివరాలు చెప్పకుండా, అధికారిక రికార్డుల ఆధారంగా గ్రీన్ బెల్ట్ హద్దులను చూపించాలని తెలిపారు. ఈ విషయం పై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను శనివారం కలిసి పూర్తి వివరాలు మాట్లాడుతామని శ్రీనివాస రావు, సిరిపురపు అప్పల నాయుడు తెలిపారు. గ్రీన్ బెల్ట్ పరిధి పై పూర్తి స్పష్టత తీసుకున్న అనంతరం తదుపరి చర్యల పై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గ్రీన్ బెల్ట్ పరిధి పై అధికారిక పత్రాలు, హద్దుల పై స్పష్టత వచ్చే వరకు పనులు కొనసాగించేందుకు అనుమతించ బోమని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీకాంత్, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస రావు, పయిల బుజ్జి, పయిల కృష్ణ, పయిల అప్పారావు, బండారు చిన్న నాయుడు, పయిల చిన్న, రైతులు పాల్గొన్నారు.ం

# యోగా సాధన తోనే ఆయుష్

- వేంపాడు లో యోగా నూతన భవనం ప్రారంభం
- ఆయుష్ ఆర్డీడీ డాక్టర్ కె.శ్రీనివాస్





**నక్కపల్లి,పెన్ సత్తా అక్టోబరు01:** ప్రతి ఒక్కరూ యోగ సాధన తోనే ఆరోగ్యవంతంగా జీవిస్తారని ఆయుష్ శాఖ ఆర్ డిడి కె. శ్రీనివాసరావు అన్నారు. మనిషి శరీరంలో ఆక్సిజన్ సరఫరా సక్రమంగా వున్నప్పుడే మంచి ఆరోగ్యవంత లుగా వుంటారని, ఆక్సిజన్ లెవెల్స్ తగ్గితే చాలా ఇబ్బందులు వస్తాయని, సంపూర్ణమైన ఆరోగ్యం కొరకు ప్రతీ ఒక్కరూ యోగ సాధన చేయాలని కె.శ్రీనివాస్ చెప్పారు. గురువారం వేంపాడు ఆయుష్ ఆస్పత్రి ఆవరణలో పలువురు దాతలు కొత్తగా నిర్మించిన యోగా, పంచకర్మ నూతన భవనాన్ని దాతలు, గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీడీ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో వేంపాడులో పంచకర్మ యూనిట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. లక్షలాది రూపాయలు వెచ్చించి దాతలు యోగా, పంచకర్మ భవనాన్ని నిర్మించి ఎందరికో ఆ దర్శంగా నిలిచారని చెప్పారు. సుమారు రూ. 5 లక్షలు వ్యయంతో యోగా,పంచకర్మ మందిర్ భవనాన్ని నిర్మించిన దాతలను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కె.రఘు, గ్రామ పెద్దలు అయినంపూడి మణిరాజు, కళ్లేపల్లి నాగులరాజు, సుబ్బరాజు, రఘురాజు, నాగ లింగేశ్వరరావు, రవిరాజు, సురేశ్ రాజు, ఆయుష్ సీనియర్ ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్లు డీ ఎన్ వీ సాయి, డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య**




**ధర్మవరం,అక్టోబర్ 01 (పెన్ సత్తా)**పట్టణంలోని 40 వార్డులలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు పలుచోట్ల పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పెన్షన్ దారులతో పెన్షన్ అందే కార్యక్రమంపై వారు ఆరా తీశారు. పెన్షన్ దారులు ఎవరికి ఎటువంటి లంచం ఇవ్వరాదన్న సందేశాలు కూడా ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. మొత్తం పట్టణంలోని 40 వార్డులలో 17,609 మందికి గాను 16,535 మందికి పంపిణీ చేయగా 94 శాతం నమోదు కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ విజయభాస్కర్,స్వర్ణ వార్డ్ మేనేజర్ అశ్వత్ నారాయణ పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే కూటమి సర్కార్ సంకల్పం: గంటా నూకరాజు



**భీమిలి, (పెన్ సత్తా) ప్రతినిధి:**పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు.
భీమిలి జోన్ 3వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మహిళల భద్రతతో పాటు పేదల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త పింఛన్ల మంజూరుపై త్వరలో ప్రభుత్వం నుంచి శుభవార్త వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పద్మనాభం పోలీసులు సన్నద్ధం






**పద్మనాభం, (పెన్ సత్తా) ప్రతినిధి:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పద్మనాభం పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌ఓ, పద్మనాభం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో, తహసీల్దార్, ఇతర మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు.మండలంలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి జోన్లు, రూట్లు, సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, లొకేషన్లు, పోలింగ్ కేంద్రాల సంఖ్య తదితర అంశాలను సంబంధిత శాఖల అధికారులతో చర్చించి ఖరారు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో లిఅష్యూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్ (ఏఎంఎఫ్)లికు సంబంధించిన 23 అంశాల చెక్‌లిస్ట్‌ను పరిశీలించారు.పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలింగ్ కేంద్రాలు, రూట్ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందస్తు చర్యలు కొనసాగిస్తున్నట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు.

## చెరువులో కాలుజారి యువకుడి మృతి

- స్నేహితులతో కలిసి వెళ్తుండగా విషాద ఘటన



**పద్మనాభం, (పెన్ సత్తా)ప్రతినిధి** విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పెంట గ్రామానికి చెందిన జామి వేణు (33) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని పెదరావుపల్లి గ్రామ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పెంట గ్రామానికి చెందిన వేణు తన నలుగురు స్నేహితులతో కలిసి కొత్తవలసలోని హోల్‌సేల్ ఐరన్ షాపులో సామగ్రి కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో పెదరావుపల్లి సమీపంలోని కొత్తచెరువు వద్ద ఆగారు. బహిర్భూమికి వెళ్లిన అనంతరం చెరువులో దిగి కడుక్కుంటుండగా వేణు ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.కొంతసేపటికి వేణు కనిపించకపోవడంతో స్నేహితులు చెరువు వద్దకు వెళ్లి చూడగా ఆయన దుస్తులు ఒడ్డున కనిపించాయి. దీంతో వేణు చెరువులో మునిగిపోయినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు రెండు గంటల పాటు గాలింపు చేపట్టి వేణు మృతదేహాన్ని బయటకు తీశారు.సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వేణుకు భార్య దేవి (26), కుమార్తె కనిష్క (7), కుమారుడు జోశ్విక్ (1) ఉన్నారు. మృతదేహాన్ని చూసి భార్య, తల్లిదండ్రులు, సోదరుడు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.మృతుడి భార్య జామి దేవి ఫిర్యాదు మేరకు కొత్తవలస పోలీస్ స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పిడుగుపాటుకు 21 మేకలు,గొర్రెలు మృతి



బాధిత కుటుంబానికి అండగా మంత్రి సత్యకుమార్ యాదవ్

మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు

**ధర్మవరం,అక్టోబర్ 01 (పెన్ సత్తా)** ధర్మవరం నియోజకవర్గంలోని మల్కాపురం గ్రామ సమీపంలో పిడుగుపాటుకు గురై 21 మేకలు,గొర్రెలు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ స్పందించారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించి,జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకోవాలని తన నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబును సంఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు.మంత్రి ఆదేశాల మేరకు హరీష్ బాబు మల్కాపురం గ్రామ సమీపంలోని సంఘటనా స్థలానికి చేరుకుని పిడుగుపాటుతో మృతి చెందిన మేకలు,గొర్రెలను పరిశీలించారు.కురబ సామాజిక వర్గానికి చెందిన బాధితుడు బిల్లే విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ ఘటనలో సుమారు రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు హరీష్ బాబుకు వివరించారు. అనంతరం హరీష్ బాబు మంత్రి సత్యకుమార్ యాదవ్ కి ఘటన వివరాలను ఫోన్ ద్వారా తెలియజేసి, బాధితుడు బిల్లే విజయ్‌తో మంత్రి ని ఫోన్‌లో మాట్లాడించారు.ఈ సందర్భంగా పిడుగుపాటుతో మేకలు,గొర్రెలు మృతి చెందిన ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, తామంతా వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.ఈ ఘటనపై ఇప్పటికే జిల్లా కలెక్టర్,ఆర్డీఓ తో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడినట్లు తెలిపారు.
బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున సాధ్యమైనంత మేర అండగా నిలిచి, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ మండల అధ్యక్షులు గొట్లూరు చంద్ర,బీజేపీ నాయకులు శంకర్ రెడ్డి,చింతలపల్లి రమేష్,నారా కొండయ్య చౌదరి, తెలుగు యువత ధర్మవరం రూరల్ అధ్యక్షుడు చిట్ర అశోక్,తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

- పోషకాహారంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం
- ప్రియాంక నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాసం
- 19 మంది గర్భిణులకు ఘనంగా సీమంతం



**ధర్మవరం,అక్టోబర్ 01 (పెన్ సత్తా)** తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య సూచించారు. ధర్మవరం పట్టణంలోని ప్రియాంక నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్యతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్,మాధవరెడ్డి హాజరయ్యారు.
టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని గీత,ప్రసాద్ నాయుడు దంపతుల ఆధ్వర్యంలో 19 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులకు పసుపు, కుంకుమ,పూలు, పండ్లు,చీరలు అందించి ఆశీర్వదించారు.
ఈ సందర్భంగా కమతం కాటమయ్య మాట్లాడుతూ, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.గర్భధారణ సమయంలో సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మహిళలు,చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.భీమనేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, గర్భిణులను తమ ఇంటి అక్క చెల్లెమ్మలుగా భావించి దంపతులు సీమంతం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తల్లీబిడ్డల సంరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమానికి తన వంతు సహాయం అందించడం భగవంతుడు కల్పించిన పుణ్యంగా భావిస్తున్నానన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ, గర్భిణులు తప్పనిసరిగా సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు.తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని, గర్భధారణ సమయంలో పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి,టీడీపీ కార్యకర్తలు చీమల రాజు,గడ్డం సూరి, అమర్నాథ్ చౌదరి, విజయలక్ష్మి,తెలుగు మహిళా సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పుతో చంద్రబాబు మోసానికి ఫుల్ స్టాప్

**తాడేపల్లి:(పెన్ సత్తా)** 34 శాతం రిజర్వేషన్ల పేరుతో స్థానిక ఎన్నికల్లో బీసీల్ని మోసం చేసేందుకు చంద్రబాబు పన్నిన కుట్రలకు హైకోర్టు తీర్పుతో చెక్ పడిందని వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ స్పష్టం చేశారు. బీసీలంటే ఎప్పుడూ చంద్రబాబుకు చిన్నచూపే అని, అందుకే చెల్లవని తెలిసినా రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు చేసి, కోర్టులో మొట్టికాయలు తిన్నారని తెలిపారు. బీసీలను నిజంగా అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత జగన్మోహన్ రెడ్డి గారిదే అని, ఆయన ఇచ్చిన సంక్షేమ పథకాలు, పదవులు, 50 శాతం నామినేటెడ్ పోస్టులు, పనులే ఇందుకు సాక్ష్యమని ఉష శ్రీ చరణ్ గుర్తుచేసుకున్నారు. చంద్రబాబు చేసిన మోసానికి బీసీలు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని ఉష శ్రీ చరణ్ తేల్చిచెప్పారు.
ప్రెస్ మీట్లో ఉష శ్రీ చరణ్ ఇంకేమన్నారంటే...
చంద్రబాబు బీసీ రిజర్వేషన్ల డ్రామాలకు చెక్
బీసీలకు ఇస్తున్న 34 శాతం రిజర్వేషన్ చెల్లదని తెలిసినా కూడా చంద్రబాబు ఇచ్చినట్లే ఇచ్చి మోసం చేసారు. గతంలో జగన్మోహన్ రెడ్డి గారు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ప్రకటించగానే.. బిర్రు ప్రతాపరెడ్డి అనే వ్యక్తిని సుప్రీంకోర్టుకు పంపి చంద్రబాబు అప్పట్లో దీన్ని కొట్టేయించారు. రూల్స్ పెట్టేది ఆయనే, తిరిగి కోర్టులకు వెళ్లి వాటిని అడ్డుకునేదీ ఆయనే. జరగబోయే పరిణామాలపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలను వాడుకోవాలనే చంద్రబాబు ఇలాంటి కుట్రలు చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది, బీసీలు నిరాశలో ఉన్నారు కాబట్టి అసత్యాలు చెప్పి వారిలో ఆశ నింపే ప్రయత్నాలు చేశారు. దానికి ఇవాళ ఫుల్ స్టాప్ పడింది. బీసీ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు, హైకోర్టులో చెల్లవని తెలిసినా చంద్రబాబు అబద్దాలు చెప్తున్నారంటే.. బీసీల పట్ల ఆయన చిత్తశుద్ధి ఏపాటిదో మనం ఆలోచించాలి. చంద్రబాబు కేంద్రం, రాష్ట్రాల్లో కూడా అధికార భాగస్వామిగా ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల పట్ల ఆయనకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ లో చట్టం చేయించవచ్చు. కానీ బీసీలు జడ్జిలకు పనికి రారు, పాలనకు కూడా పనికిరారన్న భావనలో చంద్రబాబు ఎప్పుడూ ఉంటారు. బీసీల పట్ల ఆయన చిత్తశుద్ధి జీరో అని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. నిజంగా బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మేలు చేసింది జగన్మోహన్ రెడ్డి గారే. చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో జనం లేరు. జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం నామినేటెడ్ పదవులు, పనులు కేటాయించారు. బీసీల్ని ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే చంద్రబాబుకూ, బీసీలు బ్యాక్ బోన్ కులాలుగా చూసే జగన్మోహన్ రెడ్డి గారికీ ఏమాత్రం పోలిక లేదు.
బీసీల్ని అన్ని విధాలా ఆదుకున్న జగన్
బీసీలకు నాలుగు రాజ్యసభ ఎంపీ పదవులు, 11 లోక్ సభ ఎంపీ పదవులు, 20 ఎమ్మెల్సీ పదవులు, ఆరు జడ్పీ ఛైర్ పర్సన్లు, 9 మేయర్లు, 239 ఎంపీపీ పోస్టులు, 44 మున్సిపల్ ఛైర్ పర్సన్లు, 227 జడ్పీటీసీలు, 4 వేల మంది సర్పంచ్ లు ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి గారిది. ఇవన్నీ రికార్డుల్లో ఉన్నాయి. బీసీల బతుకుల్ని మార్చింది జగన్మోహన్ రెడ్డి గారే అని మేం గర్వంగా చెప్పుకుంటాం. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని పార్లమెంట్ లో ప్రైవేటు బిల్లు పెట్టించిన ఘనత జగన్మోహన్ రెడ్డి గారిది. బీసీలకు ప్రత్యేక శాఖ కావాలంటే మరో బిల్లు కూడా ప్రవేశపెట్టించారు. 139 బీసీ కులాలకు కలిపి 56 కార్పోరేషన్లు ఏర్పాటు చేసింది జగన్మోహన్ రెడ్డి గారే. బీసీల కులవృత్తులు అంతరించిపోకుండా ఉండేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్న ఆలోచన కూడా ఆయనదే. ఏ కులం తీసుకున్నా ఓ అన్నగా, తమ్ముడిగా ఆలోచిస్తూ వారికి న్యాయం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి గారిది. డీబీటీ ద్వారా లక్షా 30 వేల కోట్లు బీసీల ఖాతాల్లో క్రెడిట్ చేయించారు. నాన్ డీబీటీ ద్వారా 1.8 లక్షల కోట్లు బీసీలకు ఖర్చుపెట్టారు. అప్పట్లో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా జగన్మోహన్ రెడ్డి గారు బీసీల్ని అన్ని విధాలా ఆదుకున్నారు.
చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు బీసీలు సిద్ధం
50 ఏళ్లు నిండిన బీసీలకు పెన్షన్ ఇస్తామన్న చంద్రబాబు హామీ ఏమైంది ? మూడు బడ్జెట్లు పూర్తయినా ఇప్పటికీ దాని ఊసే లేదు. బీసీల్ని చంద్రబాబు ఓటు బ్యాంక్ గా మాత్రమే చూస్తారన్న దానికి ఇదే నిదర్శనం. చేనేతలకు నేతన్న నేస్తం ద్వారా జగన్మోహన్ రెడ్డి గారు ఏటా 24 వేలు ఇచ్చి ఆదుకున్నారు. పెనుగొండలో సోమందేపల్లి మండలంలో అక్కడ బీసీ అన్నదమ్ములందరికీ 1200 మందికి పైగా నేతన్న నేస్తం ఇచ్చాం. కానీ ఇప్పుడు చేనేత నేస్తం పేరుతో కేవలం 250 మందికి ఇచ్చి వదిలేస్తున్నారు. బీసీల పట్ల మీ చిత్తశుద్ధి ఇదేనా ? కరువుతో అనంతపురం జిల్లా,సత్యసాయి జిల్లాల్లో రైతులు అల్లాడుతున్నారు. వీరిలో సగం మంది బీసీలు ఉన్నారు. వీరికి ప్రత్యామ్నాయ పంటలు చూపించాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. కరువుతో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోలేదు. జగన్మోహన్ రెడ్డి గారు ప్రశ్నించాక కరువు మండలాల్ని ప్రకటించారు. బీసీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం బీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్ మెంట్ కూడా ఇవ్వలేకపోతున్నారు. దీంతో వారు సర్టిఫికెట్లు తీసుకోలేక, ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కురుబ సామాజిక వర్గానికి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చారు. అందులో గుడికట్ల పూజారులకు 5 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. బీసీ శాఖ మంత్రిగా ఉన్న సవితమ్మ తన సొంత సామాజికవర్గం అయినా మంత్రి పదవి పోతుందని మాట్లాడటం లేదు. బీసీలకు ఏ పథకం ఎప్పుడు ఇస్తారో తెలియని మంత్రి సవితమ్మ. నాగరికత ప్రారంభమైనప్పటి నుంచీ కులవృత్తులు చేసుకుంటున్న రజకులు, నాయీ బ్రాహ్మణుల్ని ఉద్ధరించేందుకు జగన్మోహన్ రెడ్డి గారు ఎన్నో కార్యక్రమాలు చేశారు. కానీ ఇవాళ ప్రభుత్వం వాళ్లను పూర్తిగా గాలికొదిలేసింది.
ప్రశ్నించే వైయస్ఆర్‌సీపీ బీసీ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఇందులో సీదిరి అప్పలరాజు, విడదల రజనీ, కారుమూరి సునీల్, విరూపాక్షి, జోగి రమేశ్ వంటి నేతలు ఉన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు చేసిన మంచిని ప్రజలకు వివరిస్తున్నారని, గట్టిగా మాట్లాడుతున్నారని వీరిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. బీసీల్ని ఓటు బ్యాంకుగా ఎల్లప్పుడూ చూడటం చంద్రబాబుకు కష్టమని గుర్తుంచుకోవాలి. బీసీలు అమాయకులని చంద్రబాబు అనుకోవద్దు. మీడియా, సోషల్ మీడియాలు ఉన్నాయని చంద్రబాబు దుష్ప్రచారాలు చేస్తున్నారు. బీసీల్ని ఇప్పటికైనా సీరియస్ గా తీసుకుని ఆదుకోకపోతే, బీసీలంతా ఏకమై మీ స్థానం గల్లంతు చేస్తారని చంద్రబాబు గుర్తుంచుకోవాలి. బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్ లో చట్టం తీసుకొచ్చి వారికి న్యాయం చేసే వరకూ వైయస్ఆర్‌సీపీ పోరాడుతూనే ఉంటుందని మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ తేల్చిచెప్పారు.

# డబుల్ సెంచరీల 'దాదా' రోహిత్..

## వెంటపడుతున్న గిల్!



**వన్డేల్లో ద్విశతకాలతో చరిత్రకెక్కిన ఐదుగురు భారత బ్యాటర్లు**

**మూడు డబుల్ సెంచరీలతో ఇప్పటికీ రోహిత్ శర్మదే ప్రత్యేక రికార్డు**

**రెండో ద్విశతకంతో రోహిత్ తర్వాతి స్థానంలో శుభ్‌మన్ గిల్**

**264 పరుగులతో వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు రోహిత్‌దే**

**సచిన్‌తో మొదలైన భారత '200' కథ.. గిల్‌తో మరో అధ్యాయం**

: వన్డే క్రికెట్‌లో సెంచరీ చేయడమే గొప్ప ఘనత.. అలాంటిది ఒకే ఇన్నింగ్స్‌లో 200 పరుగుల మార్కును అందుకోవడమంటే అసాధారణ ప్రదర్శనే. ఒకప్పుడు అసాధ్యమనుకున్న ఈ ఘనతను పురుషుల వన్డేల్లో తొలిసారి సచిన్ టెండూల్కర్ సుసాధ్యం చేస్తే.. ఆ తర్వాత భారత బ్యాటర్లు ద్విశతకాల పరంపరను కొనసాగించారు. ఇప్పటివరకు భారత్ తరఫున సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్ వన్డేల్లో డబుల్ సెంచరీలు నమోదు చేశారు.

### సచిన్‌తో మొదలు.. రోహిత్ హవా

2010లో దక్షిణాఫ్రికాపై గ్వాలియర్‌లో సచిన్ టెండూల్కర్ అజేయంగా 200 పరుగులు చేసి పురుషుల వన్డేల్లో ద్విశతకం సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఏడాది తర్వాత 2011లో వెస్టిండీస్‌పై వీరేంద్ర సెహ్వాగ్ 149 బంతుల్లో 219 పరుగులు బాది అప్పటి అత్యధిక వ్యక్తిగత వన్డే స్కోరు రికార్డును తన పేరున రాసుకున్నాడు.

ఆ తర్వాత మొదలైంది రోహిత్ శర్మ 'డబుల్' దండయాత్ర. 2013లో ఆస్ట్రేలియాపై 209 పరుగులు చేసిన రోహిత్.. 2014లో శ్రీలంకపై ఏకంగా 264 పరుగులు బాదాడు. వన్డే క్రికెట్‌లో ఇప్పటికీ ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. 2017లో మరోసారి శ్రీలంకపైనే అజేయంగా 208 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో మూడు ద్విశతకాలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. 2022లో బంగ్లాదేశ్‌పై ఇషాన్ కిషన్ 210 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. కేవలం 126 బంతుల్లోనే ద్విశతకం పూర్తి చేసి అప్పట్లో అత్యంత వేగంగా వన్డే డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

### ఇప్పుడు గిల్ 'డబుల్' జోరు

2023లో న్యూజిలాండ్‌పై 208 పరుగులతో తన తొలి వన్డే ద్విశతకాన్ని నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. ఇప్పుడు వెస్టిండీస్‌పై మరోసారి 200 మార్కును దాటాడు. గువాహటీలో 406 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో 133 బంతుల్లో 26 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 223 పరుగులు చేసి భారత విజయానికి వెన్నెముకగా నిలిచాడు. దీంతో వన్డేల్లో ఒకటి కంటే ఎక్కువ ద్విశతకాలు సాధించిన భారత బ్యాటర్ల జాబితాలో రోహిత్ సరసన గిల్ చేరాడు. అయితే రోహిత్‌కు మూడు, గిల్‌కు రెండు ద్విశతకాలు ఉన్నాయి. కాబట్టి మీ కాపీలో ఉన్న 'రెండు డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ తర్వాత' అన్న వాక్యాన్ని లిలి'ఒకటి కంటే ఎక్కువ డబుల్ సెంచరీలు సాధించిన రోహిత్ తర్వాత రెండో భారత బ్యాటర్'లిలిగా మార్చడం సరైనది.

భారత ద్విశతక వీరులు: సచిన్ టెండూల్కర్-200 నాటౌట్, వీరేంద్ర సెహ్వాగ్-219, రోహిత్ శర్మ-209, 264, 208 నాటౌట్, ఇషాన్ కిషన్--210, శుభ్‌మన్ గిల్-208, 223 నాటౌట్.




# హైవోల్టేజ్ గేమ్‌లో నెగ్గిన ఇండియా..

## హాకీ సెమీస్‌లో పాక్‌పై విక్టరీ

**కాకామిఘర:** డిఫెండింగ్ చాంపియన్స్ ఇండియా .. ఏషియన్ గేమ్స్ పురుషుల హాకీ ఫైనల్లోకి ప్రవేశించింది. ఇవాళ జరిగిన సెమీఫైనల్లో ఇండియా 4-3 గోల్స్ తేడాతో ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయం సాధించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 5, 13వ నిమిషాల్లో వచ్చిన రెండు పెనాల్టీ కార్నర్లను అద్భుతంగా గోల్స్‌గా మలిచాడు. ఇక ఆట 23వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ ఓ గోల్ చేశాడు. ఆట చివరి నిమిషాల్లో అభిషేక్ ఫీల్డ్ విన్నింగ్ గోల్ చేసి భారత బృందంలో ఆశలు రేపాడు. పాకిస్థాన్ జట్టు తరపున అబూ మహమూద్ 30వ నిమిషంలో, హనన్ షాహిద్ 45వ నిమిషంలో వాహిద్ రాణా 49వ నిమిషంలో గోల్స్ చేశారు. సెమీస్ మ్యాచ్‌లో ఆరంభం నుంచి ఇండియా ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్‌లు ప్రారంభంలోనే గోల్స్ చేయడంతో పాక్ టెన్షన్‌లో పడింది. కానీ సెకండ్ ఆఫ్‌లో అనూహ్య రీతిలో పాకిస్థాన్ పుంజుకుని .. ఇండియాను కొంత ఆందోళనకు గురి చేసింది. అయితే చివరి నిమిషాల్లో అభిషేక్ ఇండియాను ఓటమి నుంచి తప్పించాడు. సెకండ్ హాఫ్‌లో పాక్ ఫార్వర్డ్ ఆటగాళ్లు దూకుడు గేమ్‌ను ప్రదర్శించారు.ఆట 5వ నిమిషంలోనే హర్మన్‌ప్రీత్ తన పవర్‌ఫుల్ డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్ చేశాడు. ఇండియాకు ఫస్ట్ లీడ్ ఇచ్చాడు. ఆ తర్వాత 13వ నిమిషంలో మరో గోల్ చేసి ఇండియాను ఆధిక్యంలో నిలిపాడు. ఇండియా అటాకింగ్ గేమ్ ఆడడంతో.. ఫస్ట్ క్వార్టర్‌లో పాకిస్థాన్ ఆ ధాటిని తట్టుకోలేకపోయింది. 23వ నిమిషంలో సుఖ్‌జీత్ గోల్ కొట్టడంతో ఇండియాకు 3-0 లీడ్ వచ్చింది. కానీ హాఫ్ టైంకు 35 సెకండ్ల ముందు పాకిస్థాన్‌కు పెనాల్టీ కార్నర్‌తో గోల్ వచ్చింది. రెండో హాఫ్‌లో 3-1 తేడాతో వెనుకబడ్డ పాకిస్థాన్.. దూకుడు గేమ్ ఆడింది. 49వ నిమిషంలో హనన్ ఈక్వలైజర్ గోల్ చేసి 3-3తో ఆటపై ఆసక్తిని పెంచాడు. ఇక షూటౌట్ తప్పదు అనుకున్న సమయంలో.. ఆట ముగియడానికి 45 సెకండ్ల ముందు అభిషేక్ గోల్ చేసి పాకిస్థాన్‌ను స్టన్ చేశాడు. దక్షిణ కొరియా, మలేషియా మధ్య జరిగిన మ్యాచ్‌లో గెలిచిన జట్టుతో ఇండియా ఫైనల్లో గోల్డ్ మెడల్ కోసం పోటీపడనున్నది.

# నచ్చకపోయినా కొన్నిసార్లు రాజీ పడక తప్పదు!

గ్లామర్ ప్రపంచంలో వెలిగిపోయే తారల జీవితాలు బయట నుంచి రంగులమయంగా కనిపించినా? దాని వెనుక అనేక ఆర్థిక సవాళ్లు, వృత్తిపరమైన రాజీలు దాగి ఉంటాయనేది పచ్చి నిజం. మనకు నచ్చకపోయినా కొన్నిసార్లు పరిస్థితిని బట్టి రాజీ పడక తప్పదు అంటూ బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తెరపై ఎన్ని వైవిధ్యమైన పాత్రలు పోషించినా? సినీ పరిశ్రమలోని ఆర్థిక వాస్తవాలు, పరిమితుల వల్ల నటీనటులు ఏమాత్రం ఇష్టం లేని ప్రాజెక్టులను కూడా చేయాల్సి వస్తుందని నిర్మొహమాటంగా వెల్లడించారు.



తమకంటూ సొంత ప్రాధాన్యతలు, కళాత్మక అభిరుచులు ఉన్నప్పటికీ జీవనోపాధి కోసమే నచ్చని పాత్రలను అంగీకరించాల్సి వస్తుందని ఫాతిమా ఓపెన్‌గా చెప్పారు. -మేము సంపన్న కుటుంబాల నుంచి రాలేదు. ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరం ఉంటుంది. కేవలం నటులమే తప్ప సినిమాలకు కోట్లు ఖర్చుపెట్టే నిర్మాతులం కాదు- అంటూ సినీ రంగానికి సంబంధించిన ఆర్థిక చేదు నిజాలను బయటపెట్టారు. చేతిలో ఉన్న తక్కువ అవకాశాల్లోనే ఉత్తమమైనదాన్ని ఎంచుకుంటూ ముందడుగు వేయక తప్పదని, పరిశ్రమలో టైమింగ్ వరుస విజయాలే అవకాశాల సంఖ్యను నిర్ణయిస్తాయన్నారు.హిందీ చిత్ర పరిశ్రమలో మహిళా నటీమణులకు లభించే పాత్రల పరిమితుల గురించి కూడా ఫాతిమా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పురుష నటులకు నటనలోని పూర్తి స్థాయి నైపుణ్యాన్ని చూపించడానికి అనేక అవకాశాలు దక్కుతాయని, కానీ మహిళల విషయానికి వచ్చేసరికి లోతైన, విభిన్నమైన కోణాలున్న పాత్రలు చాలా అరుదుగా లభిస్తాయన్నారు. సినిమా అనేది సమాజానికి ప్రతిబింబమని పేర్కొంటూ సమాజంలో ఉన్నట్లే సినిమాల్లోనూ లింగ ఆధారిత పాత్రల పరిమితులు స్పష్టంగా ఉంటాయని విశ్లేషించారు.





సినిమాల్లో మహిళా పాత్రలను చిత్రీకరించే తీరుపై మాట్లాడిన ఫాతిమా నెగెటివ్ లేదా కాంప్లెక్స్ ఛాయలున్న పాత్రల విషయంలో పరిశ్రమ ఇంకా పాత మూస ధోరణుల్లోనే ఉండిపోయిందని అభిప్రాయపడ్డారు. పురుషులకు లభించినట్లుగా సంక్లిష్టమైన, గందరగోళంతో కూడిన సాధారణ మహిళా పాత్రలను హుందాగా చూపించే స్థాయికి బాలీవుడ్ ఇంకా చేరుకోలేదన్నారు. నలుపు-తెలుపుల మధ్య ఉండే సాధారణ మానవ స్వభావాన్ని మహిళా పాత్రల్లో ఆవిష్కరించే ప్రయత్నాలు మరింత ఎక్కువగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఫాతిమా షనా షేక్ తాజా ప్రాజెక్టు విషయానికి వస్తే జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న -హుంకార్-వెబ్ సిరీస్‌లో ఫాతిమా ఏసీపీ జస్లీన్ సింగ్ సోయిన్ అనే పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్‌గా నటించారు. ఒక ఆధ్యాత్మిక గురువుపై పాఠశాల విద్యార్థిని చేసే లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో సిరీస్ కథాంశం సాగుతుంది. ఈ కేసును నిర్భయంగా దర్యాప్తు చేసే పోలీస్ అధికారిగా ఫాతిమా నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com